మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 193
పేజీలు : 3

బుధవారం 11.02.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




## మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- సీఎం రేవంత్ రెడ్డికు ప్రత్యేక ఆహ్వానం

**టి మీడియా, ఫిబ్రవరి 10, హైదరాబాద్:**
కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు--2026కు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి ప్రత్యేక ఆశీర్వచనలు అందించారు.

## నేడు మున్సిపల్

# ఎన్నికల పోలింగ్







### కాంగ్రెస్ 80 శాతం సీట్లు గెలుస్తుంది మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### ఉదయం 7 గంటలకే ప్రారంభం

**టి మీడియా, ఫిబ్రవరి 10, హైదరాబాద్ బ్యూరో** : మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కి సర్వం సిద్ధమైంది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ఎన్నికల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బ్యాలెట్ పేపర్లు, బాక్సులు, ఇతర ఎన్నిక సామగ్రిని తీసుకొని ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. జిల్లాలన్నింటిలోనూ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. విస్తృతంగా తనిఖీలు చేయాలని ఓట్ల లెక్కింపు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల బృందాలకు ఎస్ఈసీ రాణికుముదిని దిశానిర్దేశం చేశారు.

**14 మంది అభ్యర్థులు ఏకగ్రీవం**

బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2,982 వార్డుల్లో 12,930 మంది భవితవ్యం తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత 12,944 మంది బరిలో మిగిలారు. అందులో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మున్సిపాల్టీలు రెండు కార్పొరేషన్లలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పన్నెండు మంది కాంగ్రెస్ ఇద్దరు బీఆర్?ఎస్? అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు.

**అవసరమైతే మరుసటి రోజు రీ పోలింగ్**

ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు 16,031 బ్యాలెట్ బాక్సులు, 137 స్ట్రాంగ్‌రూమ్‌లు, 136 ఓట్ల లెక్కింపు కేంద్రాల్ని రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం742 మంది జోనల్ అధికారులు 279 ఫ్లయింగ్ స్క్వాడ్, 381 స్క్వాడ్‌బృందాలు, 1370 రిటర్నింగ్ అధికారులు, 1547 ఏఆర్?ఓలు 9,560 పోలింగ్ అధికారులు, 31,428 మంది సిబ్బందిని నియమించి శిక్షణ ఇచ్చారు. పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల కోసం సుమారు 25 వేల మంది పోలీసులను సిద్ధం చేశారు. పోలీసులతో పాటు ఎక్సైజ్, అటవీశాఖ సిబ్బందిని భద్రత కోసం వినియోగిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా రీ పోలింగ్ అవసరమైతే మరుసటి రోజు నిర్వహిస్తారు.ఈ నెల 13వ తేదీ ఉదయం 8 నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక కోసం ఈ నెల14న నోటీసు జారీ చేస్తారు. 16న ఉదయం 11 గంటలకు మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు కార్పొరేషన్లలో కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక నిర్వహిస్తారు.

**ఓటరు స్లిప్ డౌన్‌లోడ్ ఇలా చేసుకోండి**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి మొత్తం 52,17,413 ఓటర్లు వారి ఓటును వినియోగించుకోనున్నారు. రేపు పోలింగ్ కోసం 1,379 ఆర్‌వోలు, 41,773 పోలింగ్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఎస్ఈసీ వెబ్‌సైట్, ఌజు-ౄఉూా యాప్ ద్వారా ఓటరు స్లిప్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. పోలింగ్ ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నంబర్? 9240021456 ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.

**కంట్రోల్‌రూమ్ నుంచి ప్రత్యక్ష పర్యవేక్షణ**

మున్సిపల్? ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. రాష్ట్ర బలగాలకు తోడు ఇతర రాష్ట్రాల నుంచి 3వేల మంది పోలీసులను కూడా భద్రత కోసం వినియోగించామని తెలిపారు.



**టి మీడియా, ఫిబ్రవరి 10, హైదరాబాద్ :**
మున్సిపల్ ఎన్నికలకు మరి కొన్ని గంటలు మాత్రమే సమయం ఉన్న క్రమంలో రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పీక్స్ కి చేరింది. ప్రధాన పార్టీలన్నీ గెలుపు తమదే అన్న ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఖమ్మంలోనిగార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో మీడియాతో మాట్లాడుతూ ఈమేరకు వ్యాఖ్యలు చేశారు మంత్రి పొంగులేటి. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం సీట్లను గెలుస్తుందని అన్నారు.రెండున్నరేళ్లలో చెప్పిన ప్రతి పనీ చేశామని.. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమంగా ముందుకు పోతున్నామని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు మిత్తి ఈ ప్రభుత్వం కడుతుందని అన్నారు. పార్లమెంట్, బై ఎన్నికలు, గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసాం కాబట్టే ప్రజలు మమ్మల్ని గెలిపిస్తున్నారని అన్నారు పొంగులేటి.ప్రతి పక్ష నేతలు వాడు, విడూ అనే సంస్కృతి తప్పు పడుతున్నానని.. ప్రజలు కూడా తప్పు పడతారని అన్నారు.ఆ తప్పును గమనించిన ప్రజలు మునిసిపల్ ఎన్నికల్లోబుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు.జూబ్లీహిల్స్ ఎన్నికలే రెఫరాండ అని.. ప్రజలే సమాధానం ఇచ్చారని అన్నారు పొంగులేటి.ఈ మునిసిపల్ ఎన్నికల్లో ఫలితాలు ఎట్ల వస్తున్నాయో గమనించిన మేధావులు ఇప్పుడు సైలెంట్ అయ్యారని...పేదల కోసం ఈ ప్రభుత్వ నిరంతరం పరితపిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం దొరల ప్రభుత్వం ఆ ప్రభుత్వం కుక్కలు, పందులు తినే దొడ్డు బియ్యం ఇచ్చారని అన్నారు.కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం లో పేదలకు సన్న బియ్యం ఇస్తున్నామని... సుమారు 4లక్షల ఇల్లు పేదలకు ఇచ్చామని... ఎక్కడకి పోయిన నేడు రాష్ట్రంలో ఇందిరమ్మ ఇల్లు కనిపిస్తున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో విడతలవారిగా ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని... ముఖ్యమంత్రి సుచనాలతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు పొంగులేటి.

## అమరావతికి చట్టబద్ధతపై బిల్లు పెట్టాలి

### అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ



**టి మీడియా, ఫిబ్రవరి 10, డిల్లీ :**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై చర్చించారు. ఇప్పటికే పార్లమెంటులో బిల్లు పెట్టాలని కేంద్రం నిర్ణయించగా, అందుకు అనుగుణంగా కేబినెట్ నోట్ తయారీ జరుగుతుంది. బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని చంద్రబాబు అమిత్?షాను కోరారు. దీనికి ముందే కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన సీఎం ఏపీలోని సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయం కోరుతూ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్తు, తాగునీటి భద్రత, వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయం విషయంలో పెండింగ్ అంశాలపై చర్చించారు.అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా సీఎం చర్చించారు. పోలవరం ప్రాజెక్టు స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా చూడాలని విన్నవించినట్లు సమాచారం. స్టాప్‌వర్క్ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కాలువల సామర్థ్యం పెంపుతో పెరిగిన వ్యయం రీయింబర్స్ చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ఫేజ్? -2కి ఆర్థిక సహాయం అందించాలని, ఫేజ్-2లో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టల పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. ఈ పనులకు అదనంగా సుమారు రూ.32 వేల కోట్లు అవసరమని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. పోలవరం - నల్లమలసాగర్? లింక్? ప్రాజెక్టు అంశంపై భేటీలో చర్చించారు. ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చి సాంకేతిక, ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.వీటితోపాటు ఏపీ-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కరించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రైబ్యునల్ తుది నివేదిక గెజిట్‌లో ప్రచురించాలని, వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. గోదావరి జలాల పంపకంపై ఏపీ-తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. నదీ జలాల పంపకానికి గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణాపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక చేపట్టిన చర్యలపై అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి ఎత్తు పెంపుతో ఏపీకి వచ్చే దిగువ జలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని సీఎం తెలిపారు.

**ఆరుగురు కేంద్రమంత్రులతో భేటీకానున్న చంద్రబాబు**

దిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరుగురు కేంద్రమంత్రులతో భేటీ అవుతున్నారు. ఇప్పటికే కేంద్రమంత్రులు సీఆర్ పాటిల్, అమిత్ షా చర్చలో పాల్గొన్న సీఎం నిర్మలా సీతారామన్, శివరాజ్‌సింగ్, అశ్వినీ వైష్ణవ్‌తో భేటీకానున్నారు. ఉదయం 9.30 గంటలకు జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉదయం 11 గం.కు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పలు అంశాల గురించి సీఎం చర్చించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో, మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్‌తో, సాయంత్రం 4 గంటలకు ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.

## 16 ఏళ్లలోపు యువతకు సోషల్ మీడియా బ్యాన్

### సీఎం చంద్రబాబు

**టి మీడియా, ఫిబ్రవరి 10, అమరావతి :**
పోలీసులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు. మహిళ భద్రత అనేది ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అన్నారు. మహిళల రక్షణ విషయంలో కఠినంగా ఉండాలని నిన్నటి కలెక్టర్ల మీటింగ్‌లో డీజీపీకి సూచించారు. అలాగే సోషల్ మీడియా విషయంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు సీఎం చంద్రబాబు. 16ఏళ్ల లోపు యువత సోషల్ మీడియా వాడకుండా.. బ్యాన్ చేసేలా చట్టం రూపొందిస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలో అమలు అవుతున్న చట్టం పరిశీలిస్తున్నామి తెలిపారు సీఎం.

## రాహుల్ గాంధీని అనుమతిస్తే



### అవిశ్వాస తీర్మానం వెనక్కు తీసుకునే ఛాన్స్?

**టి మీడియా, ఫిబ్రవరి 10, డిల్లీ :**
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో భేటీ అయిన తర్వాతనే, ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలా వద్దా అనే విషయంపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రతిపక్షాలు భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇస్తే వెనక్కు తగ్గాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫ్లోర్? లీడర్స్ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. తమ అభ్యంతరాలపై ప్రభుత్వం స్పందించే తీరును బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవాలని విపక్ష కూటమి భావిస్తున్నట్లు సమాచారం.

**రాహుల్‌కు అవకాశం ఇస్తే**

సోమవారమే కాంగ్రెస్ ఎంపీలు, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. ఈ తీర్మానానికి సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), డీఎంకే మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మాత్రం ఈ నోటీసుపై సంతకం చేయలేదు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటంటే, రాహుల్ గాంధీ కూడా దీనిపై ఇంకా సంతకం చేయలేదని తెలుస్తోంది. కాగా, లోక్?సభ సజావుగా సాగేలా చర్చించేందుకు స్పీకర్ ఓం బిర్లా మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రతిపక్ష నేతలను సమావేశానికి ఆహ్వానించారు. ఈ భేటీ అనంతరం రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇస్తే వెనక్కు తగ్గాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. లేనిపక్షంలో మధ్యాహ్నం 1 గంటకు లోక్?సభ సెక్రటరీ జనరల్ అత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసు అందజేయాలని విపక్షాలు భావిస్తున్నాయి.

**ఇంతకీ ఏం జరిగింది**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడాల్సి ఉంది. అయితే ఆయన 2020లో చైనాతో జరిగిన ఘర్షణపై భారత్? మాజీ సైన్యాధిపతి ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రస్తావించడానికి ప్రయత్నించారు. దీనితో ఇంకా అధికారికంగా ప్రచురించని పుస్తకంలోని అంశాలను సభలో చెప్పకూడదంటూ స్పీకర్? రూలింగ్ ఇచ్చారు. దీనిలో ప్రధాన ప్రతిపక్ష నేతను మాట్లాడకుండా స్పీకర్ అడ్డుకుంటున్నారని, ఆయనపై మోదీ సర్కార్ ఒత్తిడి ఉందంటూ ఇండియా కూటమి నేతలు విమర్శించారు.అలాగే

మిగతా 3లో..

# కాషాయం ధరించి మోసాలు

- దోషాలు తొలగిస్తామంటూ బంగారంతో పరార్

**టీ మీడియా ఫిబ్రవరి 10, , సికింద్రాబాద్? :**



మనలో దైవ భక్తి భావనలు ఉండటం సహజమే. అయితే దీనిని ఆసరాగా తీసుకుని కొందరు దుండగులు మోసాలకు పాల్పడుతున్నారు. ఆధ్యాత్మిక పూజలు చేస్తామంటూ మాటల్లో దించి దొంగతనాలు చేస్తున్నారు. వీరు ప్రధానంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దందా సాగిస్తున్నారు. వీరిని అంతర్రాష్ట్ర ముఠాగా గుర్తించిన వారాసిగూడ పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 5వ తేదీన సికింద్రాబాద్ ప్రాంతంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి దొంగిలించిన బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**పూజలు చేస్తామని నమ్మించి**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సికింద్రాబాద్?లోని వారాసిగూడ లలితానగర్‌కు చెందిన విశ్రాంత జీఎస్టీ సూపరింటెండెంట్ వెనిగళ్ల రవి ఈ నెల 5వ తేదీన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్వామీజీల వేషంలో కాషాయ బట్టలు ధరించి ఇంటికి వచ్చారు. తొలుత మంచినీళ్లు కావాలని అడిగి మాటల్లో దించిన నిందితులు తాము పూజలు చేస్తామని, దోషాలు తొలగిస్తామని నమ్మబలికారు. ఈ క్రమంలో ఆయన వేలికి ఉన్న అరతులం బంగారు ఉంగరాన్ని తీసుకుని కళ్లముందే దానిని మింగేసినట్లు నటించారు. బాధితుడు తేరుకునేలోపే సమీపంలో ఆటోతో సిద్ధంగా ఉన్న మరో నిందితుడితో కలిసి ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో మోసపోయాయని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

**బంగారం స్వాధీనం**

బాధితుడి ఫిర్యాదుతో వారాసిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఏసీపీ కె.శశాంక్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలతో పాటు స్థానికుల సమాచారంతో ఈ నెల 8న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి అరతులం బంగారు ఉంగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

**ఆధ్యాత్మిక ముసుగులో మోసాలు**

నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుభాశ్?నాథ్, కరణ్?నాథ్, సోహన్?నాథ్?గా పోలీసులు గుర్తించారు. వీరు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి పహాడీషరీఫ్ ప్రాంతంలో నివసిస్తున్నారని పోలీసులు తెలిపారు. భిక్షాటన చేస్తూ, వీలు చిక్కినప్పుడల్లా ఆధ్యాత్మిక ముసుగులో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ నేరాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. దృష్టి మరల్చి దొంగతనాలు చేయాలని పక్కా ప్రణాళికతో కాషాయ వస్త్రధారణలో స్వామీజీలుగా నమ్మబలుకుతూ లలితనగర్?లో వృద్ధులను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇన్?స్పెక్టర్ వెల్లడించారు.

**ప్రజలకు పోలీసుల విన్నపం**

స్వామీజీలు, బాబాల వేషంలో ఎవరైనా మీ ఇంటి వద్దకు వచ్చి శాంతి పూజలు, ఇతర పూజలు అంటే వారి మాటలు నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఉంటే వారిని ఇంట్లోనికి రానివ్వకపోవడమే మంచిదని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాహుల్ గాంధీని అనుమతిస్తే

మాజీ ప్రధానులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలను వదిలేసి, 8 మంది ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేశారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధారమైన ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని సోమవారం ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. రాజ్యాంగంలోని అధికరణ 94సీ కింద ఈ నోటీసు ఇవ్వాలని నిర్ణయించినట్లు, దీనిపై ఇప్పటికే 100 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

**ప్రతిపక్షాల తీరుపై కిరణ్ రిజిజు అసహనం**

మరోవైపు, కాంగ్రెస్?కు సభ సజావుగా నడవడం ఇష్టం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటోందని అన్నారు. బడ్జెట్?పై చర్చలకు ఇతర ప్రతిపక్ష పార్టీలు సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ మాత్రం జరగనివ్వడం లేదని ఆరోపించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే, విపక్షాలు వెల్?లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. దీనితో సభను తొలుత 12 గంటల వరకు వాయిదా వేశారు. మళ్లీ అదే పరిస్థితి పునరావృతం కావడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. దీనిపై కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు, "ఇది బడ్జెట్ సమయం. దీనిపై మనం చర్చించాలి. చర్చకు రావాలని నిన్న కూడా నేను కాంగ్రెస్?కు విజ్ఞప్తి చేశాను. డీఎంకే, సమాజ్?వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్? నేతలు మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ కాంగ్రెస్?కు మాత్రం పార్లమెంట్ పనిచేయడం ఇష్టం లేనట్లుగా ప్రవర్తిస్తోంది. కాంగ్రెస్ ఇప్పటికే సభ గౌరవాన్ని తగ్గించింది. ఇంకా దాన్ని దిగజార్చవచ్చు. బడ్జెట్?పై చర్చ జరగనివ్వండి" అని కిరణ్? రిజిజు అన్నారు.

## లారీని ఢీకొట్టిన అంబులెన్స్..

- అందులోనే ఇరుక్కుపోయిన పేషెంట్..

**టి మీడియా, ఫిబ్రవరి 10, హైదరాబాద్ :**




వనస్థలిపురంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొట్టడంతో ఇద్దరు పేషంట్లకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వనస్థలిపురం దగ్గర ఇద్దరు పేషంట్లతో వెళ్తున్న అంబులెన్స్ ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒక పేషంట్ గాయాలతో బయటపడగా.. మరో పేషెంట్ అంబులెన్స్ లోనే ఇరుక్కుపోయాడు. అంబులెన్స్ లో ఇరుక్కుపోయిన పేషెంట్ ను అతికష్టం మీ బయటికి తీశారు స్థానికులు. ఘటన జరిగిన సమయంలో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. అసలే పేషెంట్ట్రీ.. ట్మెంట్ కోసం ఆసుపత్రికి అంబులెన్స్ లో వెళ్తుంటే యాక్సిడెంట్ అయ్యాయి గాయపడటం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు బాధితుడి కుటుంబసభ్యులు, బంధువులు. ఆగి ఉన్న లారీ ఢీకొట్టడం అంబులెన్స్ డ్రైవర్ దే తప్పిదమని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డ్రైవర్ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు బంధువులు.

## మూడు సంచుల్లో నగదు..

- గోషామహల్‌లో భారీగా డబ్బు పట్టివేత

**టి మీడియా, ఫిబ్రవరి 10, హైదరాబాద్ :**



గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ మొత్తంలో నగదు పట్టుకున్నారు. ఫిబ్రవరి 9న సాయంత్రం గోషామహల్ గ్యాన్‌బాగ్ కాలనీలోని గోకుల్ గోల్డ్ ఎలక్ట్రిక్ ఐటమ్స్ షాప్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా సంచులతో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీరిని ఆపి పరిశీలించగా.. సంచుల్లో భారీగా డబ్బు ఉన్నట్లు బయటపడింది.!తనిఖీలో మూడు సంచుల్లో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం నగదు విలువ రూ.76,87,650గా నిర్ధారణైంది. నగదు తరలింపు తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. అనుమానితులను జ్యోతిరామ్, గణపతి రామ్, మహేందర్‌లుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురినీ గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి నగదుపై విచారణ చేపట్టారు. విచారణ సమయంలో అనుమానితులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పాటు నగదుకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను సమర్పించలేకపోయారు. దీంతో నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై గోషామహల్ ఇన్‌స్పెక్టర్ స్పందిస్తూ.. స్వాధీనం చేసుకున్న నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. అక్రమ నగదు తరలింపులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ

- మాదాపూర్ ఎస్ ఐ వినయ్

**టి మీడియా, ఫిబ్రవరి 10, హైదరాబాద్:**



హైదరాబాద్ లో మరో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు చిక్కింది. మాదాపూర్ పీఎస్లో పనిచేస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ వినయ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికా రులకు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. ఓ కేసు విషయంలో సహాయం చేస్తా అని బాధితుడి నుంచి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఎస్సై వినయ్. దీంతో బాధితుడు ఏసీబీ అధికారు లను ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఆ మె ఎత్తాన్ని వినయ్ తీసుకుంటూన్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. లంచం మొత్తం స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, వినయన్ను అదుపులోకి తీసుకునివిచారణ చేపట్టారు. ఈ వసూళ్లపై ఉన్నతాధి కారులతో లింక్స్ ఉన్నట్లు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అవి నీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు హెచ్చరించారు.

## స్వయం పరిపాలనస్వయం పాలన ధీనోత్సవం

**టీ మీడియా ఫిబ్రవరి 10, టేక్మాల్ ప్రతినిధి:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండలం లోని స్థానిక గ్రామం లోని మంగళవారం శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. బాల్య మాట్లాడుతూ విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా బాధ్యతలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో లక్ష్యాలను సాధించేందుకు పునాది పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5వ తరగతి విద్యార్థులు వివిధ పాత్రల్లో చురుకుగా పాల్గొన్నారు. కలెక్టర్‌గా ధరణి, డీఈవోగా శ్రీనాథ్, ఎంఈఓగా మధు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌గా దీక్షిత, పాఠశాల హెడ్‌మాస్టర్‌గా భాస్కర్ బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే ఉపాధ్యాయుల పాత్రలను విద్యార్థులే స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, నరేష్, మాలతి తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## కేరళలో డిగ్రీ వరకు ఫ్రీ చదువు..

-దేశంలోనే మొట్టమొదటిసారి..

**టి మీడియా, ఫిబ్రవరి 10, ఢిల్లీ బ్యూరో :**




కేరళ రాష్ట్రం విద్యారంగంలో మరో చరిత్ర సృష్టించింది. దేశంలోనే మొదటిసారిగా గ్రాడ్యుయేషన్ అంటే డిగ్రీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు కేరళ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు కేరళలో ఇంటర్ (12th) వరకే ఉచిత విద్య ఉండేది. ఇకపై ప్రభుత్వ ఉ ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీల్లో చేరే ఆర్ట్స్ ఉ సైన్స్ విద్యార్థులందరికీ ఉచితంగా విద్యను అందించాలని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ బడ్జెట్‌లో ప్రకటించారు. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లకుండా రాష్ట్రంలోనే అత్యాధునిక సాంకేతికత, స్కిల్ డెవలప్‌మెంట్ నేర్పేలా ఒక గ్లోబల్ స్కూల్ ను ఏర్పాటు చేయనున్నారు. వేరే స్కాలర్‌షిప్‌లు లేని ఫుల్ టైం పీహెచ్‌డీ విద్యార్థులకు నెలకు రూ.15 వేలు గ్రాంట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం దాదాపు రూ.38.76 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ స్కూళ్లల్లో చదివే విద్యార్థుల వసతి సౌకర్యాల కోసం ఎర్నాకుళం, త్రిస్సూర్, కోజికోడ్‌లో మొదటి దశలో కొత్త పబ్లిక్ హాస్టళ్లను నిర్మించనున్నారు.

# మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

- ఎన్నిక రద్దు చేసిన అధికారులు

**టి మీడియా, ఫిబ్రవరి 10, నారాయణపేట**



నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 6వ వార్డు చందపూరులో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారు. 6వ వార్డు నుంచి గెలుపొందేందుకు మహదేవప్పకు ఎక్కువ అవకాశాలుండటంతో ఇతర పార్టీ నాయకులు బెదిరింపులకు గురి చేయడంతో భయభ్రాంతులకు లోనై ఉరి వేసుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి మృతి కారణంగా ఆరో వార్డు ఎన్నిక రద్దు చేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

**బెదిరింపులు, ఆరోపణలే**

బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య ఘటనపై బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపులు, వేధింపులే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు.

**కాంగ్రెస్ నాయకులు అరాచకాలు చేస్తున్నారు**

మహదేవప్పది ఆత్మహత్య కాదు, కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమ సహనాన్ని పిరికితనంగా భావిస్తారా? అని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయని ధ్వజమెత్తారు. కార్యకర్తలారా ధైర్యంగా ఉండండి, నాయకత్వం అండగా ఉందని తెలిపారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

**రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి**

బీజేపీ ఎంపీ డి.కె.అరుణ మహదేవప్ప కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. మహదేవప్ప ఆత్మహత్య ఘటనను రాజ్యసభలో ప్రస్తావించినట్లు ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. కాంగ్రెస్ ఒత్తిడితో ఎస్టీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమని అన్నారు. ఈ ఘటనను కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహదేవప్ప ఆత్మహత్యపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని అన్నారు.

**తోపులాటలో కిందపడిన డీసీపీ**

మక్తల్?లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యకు కాంగ్రెస్ కారణమంటూ బీజేపీ నాయకులు హైదరాబాద్?లోని డీజీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ తోపులాటలో ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి కిందపడిపోయారు. పలువురు పోలీసులు, బీజేపీ కార్యకర్తలకు గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

ఫిర్యాదు వచ్చింది : మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని డీజీపీ శివధర్? రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మహదేవప్ప ఎటువంటి ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసిందని చెప్పారు.

### 30 కోట్ల మందితో..

# 12న భారత్ బంద్

-10 ప్రధాన కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక

**టి మీడియా, ఫిబ్రవరి 10, ఢిల్లీ బ్యూరో :**




కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్త భారత్ బంద్(సార్వత్రిక సమ్మె)కి పిలుపునిచ్చారు. ఈ మేరకు 10 ప్రధాన కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఈ సమ్మె జరుగుతోంది.30 కోట్ల మందితో సమ్మెఈ బంద్ లో ఈసారి దాదాపు 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా. అలాగే 2025 జూలైలో జరిగిన నిరసన కంటే పెద్దదిగా ఉండబోతోంది. దేశవ్యాప్తంగా సుమారు 600 జిల్లాల్లో ఈ సమ్మె ప్రభావం కనిపిస్తుందని యూనియన్ నాయకురాలు అమర్‌జీత్ కౌర్ తెలిపారు. ఒడిశా, అస్సాం వంటి రాష్ట్రాల్లో పూర్తి బంద్ జరిగే అవకాశం ఉంది. సంయుక్త కిసాన్ మోర్చా ఈ సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించింది. విద్యార్థి, యువజన సంఘాలు కూడా ఈ నిరసనల్లో పాల్గొననుంది.సమ్మె డిమాండ్లు ఏంటంటే :కొత్తగా తెచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలి. అలాగే విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను వెనక్కి తీసుకోవాలి. ఇంకా ప్రైవేటీకరణను ఆపాలి. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.ఆపిల్ రైతుల ఆందోళనఈ సమ్మెలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆపిల్ రైతులు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. వీరు ఢిల్లీ మార్చ్ కు కూడా ప్లాన్ చేస్తున్నారు. అమెరికా, న్యూజిలాండ్ నుంచి వచ్చే ఆపిల్స్‌పై దిగుమతి సుంకంతగ్గించడం వల్ల వ్యాపారం దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విదేశీ కార్పొరేట్ సంస్థల పోటీని తట్టుకోలేమని హెచ్చరిస్తున్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ఇప్పటికే సమ్మె నోటీసులు ఇవ్వగా... సమ్మె సన్నాహాలు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయని యూనియన్లు తెలిపాయి.

## అవిశ్వాస తీర్మానంపై ఓం బిర్లా కీలక నిర్ణయం

-సభకు రాకూడదని నిర్ణయం

**టి మీడియా, ఫిబ్రవరి 10, ఢిల్లీ బ్యూరో :**



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యే వరకు సభకు రాకూడదని నిర్ణయించుకున్నారు. తనపై వచ్చిన అవిశ్వాస నోటీసు పరిష్కారం అయ్యే వరకు సభా కార్యక్రమాలకు హాజరుకావద్దని ఓం బిర్లా నైతిక కారణాలపై నిర్ణయం తీసుకున్నట్లు పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విపక్షాలు ఈ ఉదయం లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు సమర్పించాయి. లోక్‌సభ నియమావళి 94జ ప్రకారం ఈ నోటీసును మధ్యాహ్నం 1:14 గంటలకు సమర్పించినట్లు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. మొత్తం 118 మంది ఎంపీలు ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా సంతకాలు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు కూడా**

స్పీకర్ ఓం బిర్లా వ్యవహారశైలిపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. సభను ఆయన పక్షపాత ధోరణితో నడుపుతున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు కూడా అనుమతి నిరాకరించారని తెలిపారు.

**ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం**

ఇదే సమయంలో ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం కూడా ఏకపక్ష నిర్ణయమని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. స్పీకర్ వ్యాఖ్యలు రాజ్యాంగ పదవికి తగినవిగా లేవని, సభలో తటస్థంగా వ్యవహరించాల్సిన బాధ్యతను ఆయన విస్మరించారని విమర్శించాయి. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు హాజరుకావొద్దని స్పీకర్ సూచించినట్లు వచ్చిన సమాచారం కూడా వివాదానికి దారి తీసింది. మహిళా ఎంపీలు దాడి చేసే అవకాశం ఉందనే సమాచారంతోనే ఈ సూచన చేశామని బిర్లా ప్రకటించినప్పటికీ, దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది సభా గౌరవాన్ని దెబ్బతీసే ప్రకటనగా అభివర్ణించాయి. ఈ నేపథ్యంలో తనపై వచ్చిన అవిశ్వాస నోటీసును పరిశీలించాలని లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు స్పీకర్ ఆదేశాలు ఇచ్చారు. నోటీసును నియమావళి ప్రకారం అధ్యయనం చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని లోక్‌సభ కార్యాలయ వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఈ అంశంపై సభలో చర్చ జరిగే అవకాశం ఉంది.


**కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టిన బీజేపీ**

ఇక ఈ పరిణామాలపై అధికార పార్టీ బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తింది. బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర మాట్లాడుతూ, "సభ నియమాలను పాటించకుండా వ్యవహరించే కాంగ్రెస్‌కు స్పీకర్‌పై అవిశ్వాసం చెప్పే నైతిక హక్కు లేదు" అని విమర్శించారు. గతంలో తమిళనాడుకు చెందిన ఒక న్యాయమూర్తిపై కాంగ్రెస్ ఇంపీచ్‌మెంట్ ప్రయత్నం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దీపం కేసులో సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టారు. అయితే కాంగ్రెస్ మాత్రం తన ఆరోపణలపై నిలదొక్కుకుంది. సభలో ప్రతిపక్షాల స్వరం అణచివేస్తున్నారని, ప్రజాస్వామ్య సంప్రదాయాలు దెబ్బతింటున్నాయని అంటోంది. స్పీకర్ పదవిలో తటస్థత అత్యంత ముఖ్యమని, అది పాటించకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేసింది. మొత్తానికి లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడం అరుదైన పరిణామం కావడంతో దేశవ్యాప్తంగా రాజకీయంగా ఇది పెద్ద చర్చకు దారి తీసింది. స్పీకర్ నిర్ణయం, సెక్రటేరియట్ పరిశీలన, తదుపరి సభా ప్రక్రియలపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది. రాబోయే రోజుల్లో పార్లమెంట్‌లో ఈ అంశంపై తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

## తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపు

-రాష్ట్రపతి పరిశీలనలో రెండు కీలక బిల్లులు

**టి మీడియా, ఫిబ్రవరి 10, హైదరాబాద్ బ్యూరో :**





తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ఇప్పుడు కేంద్రం పరిధిలోకి చేరింది. రాష్ట్రంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు , స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ప్రస్తుతం ఉన్న స్థాయి నుండి 42 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండగా, దీనికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా వెల్లడించింది. లోక్‌సభలో ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి బీఎల్ వర్మ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి రెండు బిల్లులు కేంద్రానికి అందాయని స్పష్టం చేశారు. ఈ బిల్లులు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్రం వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. OnePlus ధమాకా..! రూ.16 వేలకే అదిరిపోయే ట్యాబ్.. మిస్ అవ్వకండి.!రిజర్వేషన్ల శాతం పెంచడం అనేది రాజ్యాంగ పరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన ఈ రెండు బిల్లులను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రపతి భవన్‌కు పంపడం జరిగింది. తెలంగాణలోని బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేకూర్చే క్రమంలో 42 శాతం కోటాను అమలు చేయాలన్న ప్రతిపాదనపై కేంద్రం వివిధ కోణాల్లో అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం ఈ బిల్లులు పరిశీలన దశలో ఉన్నాయని, తదుపరి చర్యలు రాష్ట్రపతి ఆమోదంపై ఆధారపడి ఉంటాయని మంత్రి వెల్లడించారు. ఈటల రాజేందర్ వేసిన ఈ ప్రశ్నతో బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియపై రాష్ట్రంలో నెలకొన్న సందిగ్ధతకు కొంత వరకు తెరపడినట్లయింది. కేంద్రం తీసుకునే తదుపరి నిర్ణయంపైనే తెలంగాణలోని బీసీ సామాజిక వర్గాల రాజకీయ , ఉపాధి భవిష్యత్తు ఆధారపడి ఉంది.

### జీవితాన్ని మార్చేసిన

# ఆ ఒక్క నవ్వు

**టి మీడియా, ఫిబ్రవరి 10, జయశంకర్ భూపాలపల్లి :**



సోషల్ మీడియాలో ప్రతిరోజూ ఎన్నో రకాల కొత్త వీడియోలు పుట్టుకొస్తుండగా.. అందులో కొన్ని వైరల్ అవుతుంటాయి. వాటిలో చాలా వీడియోలు కొద్ది రోజులకే మరిచిపోతాం. కానీ కొన్ని మాత్రం ఎలాంటి ప్రత్యేకమైన కథ లేకపోయినా వాటిని మళ్లీ మళ్లీ చూస్తూనే ఉంటాము. అలాంటి వీడియోల్లో ఒకటి టీ గ్లాస్ చేతిలో పట్టుకుని పగలబడి నవ్వే ఒక యువకుడి వీడియో గురించి ఇప్పుడు చూద్దాం. ఆ నవ్వు చూసిన ప్రతి ఒక్కరి ముఖంలోనూ చిరునవ్వు వచ్చే ఆ కుర్రాడెవడో చూసేద్దామా.ఆ వైరల్ నవ్వు వెనుక ఉన్న యువకుడి పేరు అరుణ్. అతను తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాలపల్లి (నలపుచ్చటవల్లి) గ్రామానికి చెందిన ఓ సాధారణ యువకుడు. జీవనోపాధి కోసం అతను లారీ క్లీనర్ గా పనిచేస్తున్నాడు. ఈ వీడియోను చిత్రీకరించిన వ్యక్తి లారీ డ్రైవర్ నెహ్రూ. ఇది ముందే ప్లాన్ చేసి తీసిన వీడియో కానేకాదు.అసలు ఆ నవ్వుకు గల కారణం విషయానికి వస్తే.. ఒక రోజు టీ తాగుతున్న సమయంలో నెహ్రూ సరదాగా చెప్పిన జోక్ విని అరుణ్ పకపక నవ్వాడు. ఆ సహజమైన క్షణం ప్రత్యేకంగా అనిపించడంతో నెహ్రూ తన మొబైల్‌లో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అంతే ఆ చిన్న వీడియోకు భారీ స్పందన లభించింది. కేవలం కొద్ది రోజుల్లోనే 50 మిలియన్ల వ్యూస్ సాధించింది. ఆ నవ్వు ఏ సమయంలో నవ్వాడో కానీ.. మీమ్‌లలో, కామెడీ వీడియోల్లో బాగా వినియోగిస్తూ సోషల్ మీడియాలో ఒక ట్రేడ్ మార్క్ గా మిగిలాడు.అయితే ఈ గుర్తింపు వెనుక అరుణ్ జీవితంలో ఎన్నో కష్టాలు ఉన్నాయి. పేదరికం కారణంగా నాలుగో తరగతిలోనే చదువు మానేయాల్సి వచ్చింది. చిన్న వయసులోనే పని చేయడం ప్రారంభించాడు. కానీ డ్రైవర్ నెహ్రూ ప్రోత్సాహంతో మళ్లీ చదువుపై దృష్టి పెట్టి ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడని సమాచారం. నిజానికి ఒక సాధారణ నవ్వు అతని జీవితాన్ని మార్చేసిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.